## క్లుప్తంగా

### మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

వాంకిడి(ఆసిఫాబాద్): మనస్తాపంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై డి.సాగర్ తెలిపిన వివరాల ప్రకారం ఖిరిడి గ్రామానికి చెందిన వడ్లూరి చంద్రమ్మ (58), రామయ్య దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుర్లు సంతానం. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా భర్త, ముగ్గురు కుమారులు మద్యానికి బానిసయ్యారు. ఇంటిని పట్టించుకోకుండా పనికి వెళ్లగా వచ్చిన డబ్బులన్నీ తాగడానికే ఖర్చు పెడుతుండేవారు. దీంతో మనస్తాపం చెందిన చంద్రమ్మ మంగళవారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి సోదరుడు నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### డీజే యజమానికి రూ.లక్ష జరిమానా

భీమిని(బెల్లంపల్లి): అనుమతి లేకుండా డీజే పెట్టినందుకుగానూ సదరు యజమానికి భీమిని తహసీల్దార్ లక్ష్మీరాజయ్య రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ గతేడాది అక్టోబర్ 6న భీమిని మండలంలోని కేస్లాపూర్‌లో దుర్గామాత నిమజ్జనంలో అనుమతి లేకుండా డీజే పెట్టడంతో పోలీసు కేసు నమోదైంది. దీంతో విచారణ అనంతరం డీజే యజమానికి రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

### బైండోవర్ ఉల్లంఘించిన ఒకరికి జైలు

దండేపల్లి(మంచిర్యాల): బైండోవర్ ఉల్లంఘన కేసులో ఒకరికి జైలుశిక్ష విధించినట్లు లక్సెట్టిపేట సీఐ బాబా తెలిపారు. మండలంలోని తానిమడుగుకు చెందిన మాలవత్ రమేశ్ నాటుసారా అమ్ముతూ పలుమార్లు పట్టుబడ్డాడు. దీంతో అతన్ని గతంలో దండేపల్లి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ నాటుసారా అమ్మి బైండోవర్ ఉల్లంఘించాడు. దండేపల్లి తహసీల్దార్ హన్మంతరావు రూ.లక్ష జరిమాన విధించారు. చెల్లించక పోవడంతో వచ్చే మార్చి వరకు అతనికి జైలు శిక్ష విధించారు. బుధవారం నిందితుడిని జైలుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

### ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం నామానగర్ వద్ద బుధవారం ద్వి చక్ర వాహనం అదుపు తప్పి కిందపడటంతో ఒకరు మృతి చెందారు. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీకి చెందిన అర్జున్ ప్రసాద్, తాజ్, సయ్యద్ షారుక్(23) బైక్‌పై పట్టణం నుంచి పెంచికల్‌పేట్ వైపు బయలుదేరారు. నామానగర్ మూలమలుపు వద్ద వీరి ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన షారుక్‌ను మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. గాయపడిన అర్జున్ ప్రసాద్ చికిత్స పొందుతుండగా, తాజ్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఈజ్‌గాం పోలీసులు తెలిపారు.



# పొగతో ఉక్కిరిబిక్కిరి



రాత్రిపూట రోడ్డుపై కమ్ముకున్న పొగ

- డంప్‌యార్డులో చెత్తకు నిప్పు
- ఊరంతా కమ్ముకుంటున్న పొగ
- అనారోగ్యం బారిన ప్రజలు

బెల్లంపల్లి: డంప్‌యార్డులో చెత్తకు నిప్పంటిస్తుండగా దట్టంగా పొగ కమ్ముకుని పురప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అందరూ శ్వాస తీసుకోవడానికి సతమతమవుతున్నారు. రాత్రిపూట గంటల కొద్దీ పొగ కమ్ముకుని ఉంటుండగా వృద్ధులు, చిన్నారులు, శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు నిద్రలేమికి గురవుతున్నారు. పొగ నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో బస్తీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ కొత్త బస్టాండ్ ఏరియా శివారు ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో కొన్నాళ్ల క్రితం డంప్‌యార్డును ఏర్పాటు చేశారు. ఆ భూమి ప్రస్తుతం స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ పరిధిలోకి వెళ్లడంతో అక్కడి నుంచి శాంతిఖని బస్తీ శివారు ప్రాంతంలో కొత్తగా డంప్‌యార్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. రెవెన్యూ అధికారులు పదెకరాల ప్రభుత్వ భూమి మంజూరు చేశారు. అయితే ఇప్పటివరకు కొత్తగా ప్రతిపాదించిన డంప్‌యార్డు పనులు ప్రారంభం కాకపోవడంతో రోజువారీగా సేకరిస్తున్న చెత్తను వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రహరీని ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశంలో పడేస్తున్నారు. అక్కడ చెత్త కుప్పలుతెప్పలుగా పేరుకుపోయింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన చెత్తాచెదారం గుట్టలను తలపిస్తోంది. ఆయా ప్రాంతాల్లోని చెత్తకు రాత్రి పూట నిప్పంటిస్తున్నారు. చెత్త, వ్యర్థపదార్థాలకు మంట అంటుకుని దట్టంగా పొగ కమ్ముకుని ఉంటోంది. సమీపంలోని కన్నాల బస్తీ, టేకుల బస్తీ, మధునన్న నగర్, కాంట్రాక్టర్ బస్తీ, ఫుట్‌బాల్‌గ్రౌండ్‌బస్తీ, కొత్తబస్టాండ్ ఏరియా ఇందిరమ్మకాలనీ, పాత బస్టాండ్ ఏరియా, బజారు ఏరియా, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో పొగ ప్రభావం తీవ్రంగా ఉంటోంది.

### డంప్‌యార్డు ఎత్తివేయాలి



దినాం పొగ కమ్ముకుని ఉంటోంది. నిద్రపోయే యాళ్లకు ఎవరో చెత్తకు నిప్పు పెడుతున్నరు. చెత్తకు నిప్పంటుకుని పొగంతా ఇంటిలో వ్యాపిస్తుండగా విపరీతమైన దగ్గు వస్తోంది. కండ్లు మండుతన్నయ్. సరిగా నిద్ర పట్టడం లేదు. డంప్‌యార్డు జనావాసాలకు చేరువలో ఉండడంతో పొగ భరించలేక పోతున్నాం. వెంటనే చెత్తకు నిప్పు పెట్టడాన్ని ఆపేసి డంప్‌యార్డును అక్కడి నుంచి ఎత్తివేయాలి.

– కన్నూరి ఓదెలు, స్థానికుడు

### అప్పటి ఇబ్బందులు వద్దు



డంప్‌యార్డు నిర్వహణను మున్సిపల్ అధికారులు కొన్నినెలలుగా పట్టించుకుంటలేరు. కనీస చర్యలు తీసుకోకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. రాత్రివేళ డంప్‌యార్డు, ఇతర ప్రాంతాల్లో ఉన్న చెత్తకు నిప్పు పెడుతుండగా వచ్చే పొగ మామూలుగా ఉండడం లేదు. దట్టంగా వ్యాపించి ఊపిరి సలపకుండా చేస్తున్నది. వృద్ధులు, పిల్లలు భరించ లేకపోతున్నారు. ఆస్తమా పేషెంట్ల పరిస్థితి దారుణం. వెంటనే అధికారులు చర్యలు తీసుకుని ఇబ్బందులు లేకుండా చూడాలి.

– చింతల బాలరాజు, స్థానికుడు

### పక్షం రోజుల నుంచి..

గడిచిన పక్షం రోజులుగా చెత్తకు ఇష్టారాజ్యంగా నిప్పంటిస్తున్నారు. చీకటి పడగానే నిప్పు పెడుతుండడంతో క్రమంగా పొగ వ్యాప్తి చెందుతోంది. రాత్రి 10 గంటల నుంచి సమీప ప్రాంతాలన్నీ పొగతో కమ్ముకుని ఉంటున్నాయి. మరో వైపు పొగతో గాలి కలుషితమవుతోంది. సరిగ్గా నిద్రకు ఉపక్రమించే వేళ పొగ దట్టంగా ఇళ్లలో వ్యాపిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇంటి కిటికీలు మూసి ఉన్నా లోపలికి పొగ వ్యాప్తి చెంది ఇబ్బంది పడుతున్నారు. పొగ బారి నుంచి కాపాడుకునే చర్యలు కానరాక అనేకమంది దగ్గుతో బాధ పడుతున్నారు. శ్వాస తీసుకోలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, అస్తమా వ్యాధి గ్రస్తుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటోంది. పొగ కారణంగా గంటల కొద్దీ సమయం నిద్రపట్టకుండా గడుపుతున్నామని పలు బస్తీల ప్రజలు పేర్కొంటున్నారు. చెత్త నుంచి వెలువడుతున్న పొగతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. చెత్తకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవడం లేదు. ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకుని పొగ నుంచి కాపాడాలని పురప్రజలు కోరుతున్నారు.

## ఖైదీలు క్రమశిక్షణ కలిగి ఉండాలి

- జూనియర్ సివిల్ జడ్జి అసుదుల్లా షరీఫ్

లక్సెట్టిపేట(మంచిర్యాల): అండర్ ట్రయల్ ఖైదీలు క్రమశిక్షణ కలిగి ఉండాలని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసుదుల్లా షరీఫ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌జైల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో నేరాలు చేసి కోర్టులు, జైళ్ల చుట్టూ తిరిగి సమయాన్ని, భవిష్యత్‌ను వృథా చేసుకోవద్దన్నారు. జైల్‌లో క్రమశిక్షణతో పాటు పరిశుభ్రతను పాటించాలని, భవిష్యత్‌లో మంచి పౌరులుగా ఉండాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలర్ స్వామి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, న్యాయవాది తాజొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి అసుదుల్లా షరీఫ్

## విద్యుత్ అదనపు చార్జీలు రద్దు చేయాలి

పాతమంచిర్యాల: విద్యుత్ వినియోగ దారులపై విధిస్తున్న అదనపు చార్జీ(ఏసీడీ)లను రద్దు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ధరల భారంతో సతమతమవుతున్న తెలంగాణ ప్రజలపై విద్యుత్ సంస్థలు నష్టాల పేరుతో ప్రజలపై భారం మోపడం దుర్మార్గమైన చర్య అన్నారు. విద్యుత్ సంస్థల నష్టాలకు రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చాంద్ పాషా, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి అందె మంగ, ఆలిండియా కిసాన్ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు లాల్‌కుమార్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, ఐఎఫ్‌టీయూ నాయకుడు తోకల తిరుపతి, పీవోడబ్ల్యూ జిల్లా నాయకులు జ్యోతి, అరుణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, అరుణోదయ జిల్లా కార్యదర్శి మల్లన్న, పీవైఎల్ నాయకులు సాజిద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టి.శ్రీనివాస్

## బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో విధులు నిర్వర్తిస్తున్న బీసీ ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలని ఆర్కే 6 గని మేనేజర్ ఈ.తిరుపతి సూచించారు. బుధవారం గనిపై సింగరేణి బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ అంతా ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. ఇందుకు గనుల వారీగా పిట్ కమిటీ వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గని వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, డెప్యూటీ మేనేజర్ మర్రి కొమురయ్య, అండర్ మేనేజర్ ప్రశాంత్, ఇంజినీర్ మహేశ్, సర్వే అధికారి వర్మ, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు వెంగళ కుమారస్వామి, గొర్రె నర్సయ్య, గోర్ల సంతోశ్, ఇప్ప భూమయ్య, సంఘం సదానందం, తోట మహేశ్, మేడారం సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీసీ ఉద్యోగులు

## బీపీఏలో 82 శాతం బొగ్గు ఉత్పత్తి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో జనవరి నెలలో 82 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జనరల్ మేనేజర్ దేవేందర్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఏరియాలో బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. జనవరిలో ఏరియాకు 3.5లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా 3.04 లక్షల టన్నులతో 82 శాతం ఉత్పత్తిని నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఏరియా 28.70 లక్షల టన్నుల లక్ష్యానికి గానూ 21.31 లక్షల టన్నులతో 74 శాతంతో ముందుకెళ్తున్నామన్నారు. ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని పూర్తి చేస్తామని, అందుకు ఏరియాలోని ఉద్యోగులు, అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, ఐఈడీ డీజీఎం పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న జీఎం దేవేందర్

## 'అదృశ్యం కేసుపై సమగ్ర విచారణ చేపట్టాలి'

కాగజ్‌నగర్‌టౌన్: తమ కుమారుడి అదృశ్యం కేసుపై సమగ్ర విచారణ చేపట్టాలని కొమ్ము దీక్షిత్ తల్లిదండ్రులు చక్రవర్తి, భాగ్యలక్ష్మి దంపతులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ బెల్లంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న తమ కుమారుడు 2022 ఫిబ్రవరి 19న ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనుంచి వెళ్లి పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. 2022 ఫిబ్రవరి 20న పెద్దపల్లి జిల్లా గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గోదావరి నదిలో ఓ గుర్తుతెలియని యువకుడి శవం లభ్యంకావడంతో పోలీసుల సమాచారం మేరకు అక్టోబర్ 18న వాటిని పరిశీలించగా చొక్కా కాదని, ప్యాంటు మాత్రం తమ కుమారుడిదేనంటూ పోలీసులకు వివరించారు. అక్టోబర్ 19న వ్యక్తి తాలుకూ వెంట్రుకలు, ఎముకలను డీఎన్ఏ పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. నివేదిక ఇప్పటివరకు రాలేదన్నారు. తమ కుమారుడికి మంచిర్యాల జిల్లా ఐబీ తాండూరుకు చెందిన ఓ అమ్మాయితో పరిచయం ఉందని, ఆమె బంధువులే కొట్టి హత్య చేశారని ఆరోపిస్తున్నారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే వేదిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి గంగుల



మేయర్ సునీల్‌రావు బ్యాటింగ్, మంత్రి కీపింగ్



తలపడుతున్న జట్లు

- విద్యార్థులు, యువత క్రీడా రంగంలో రాణించాలి
- సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ 4ను ప్రారంభించిన మంత్రి గంగుల

కరీంనగర్‌స్పోర్ట్స్: గ్రామీణ ప్రాంతాల్లోని మెరికల్లాంటి క్రీడాకారులను వెలికి తీసేందుకు 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ఒక వేదికలాంటిదని, 'సాక్షి' మీడియా చేస్తున్న ప్రయత్నం అద్వితీయమని రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో, స్టేట్ స్పాన్సర్ సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ 4 పోటీలను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతోనే యువత, చిన్నారులు సన్మార్గాల్లో నడుస్తారన్నారు. యువత విద్యలోనే కాకుండా అన్నిరంగాల్లోనూ రాణించాలన్నారు. మేయర్ సునీల్ రావు, జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ సాగర్‌రావు మాట్లాడుతూ ఇలాంటి పోటీలు గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు సువర్ణావకాశమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి, మేయర్ బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. అంతకుముందు ఉదయం జరిగిన పోటీలను జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో సుధాకర్ పైప్స్ ఏరియా మేనేజర్ షేక్ రఫీ, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, కార్పొరేటర్ ఎడ్ల అశోక్, కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, బ్యూరో ఇన్‌చార్జి అనిల్, ఏడీవీటీ మేనేజర్ లక్ష్మీనారాయణ, సర్క్యులేషన్ మేనేజర్ మధుకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

**తొలి రోజు ఫలితాలు**

జూనియర్స్ విభాగంలో జ్యోతిష్మతి డిప్లొమా కళాశాల, కరీంనగర్ జట్టు.. అల్ఫోర్స్ జూనియర్ కళాశాల, మంచిర్యాలపై గెలిచింది. ఎస్సారార్ జూనియర్ కళాశాల, మంచిర్యాల జట్టు.. కాకతీయ జూనియర్ కళాశాల, గోదావరిఖని జట్టుపై విజయం సాధించింది. సీనియర్స్ విభాగంలో వివేకానంద డిగ్రీ కళాశాల, కరీంనగర్ జట్టు వివేకానంద ఇంజనీరింగ్ కళాశాల, కరీంనగర్‌పై విజయం సాధించింది. జూనియర్స్ బ్యాటింగ్‌లో రిషి (అల్ఫోర్స్) 23 పరుగులు, ఫిరోజ్ (జ్యోతిష్మతి) 20 పరుగులు, హుర్రేయర్ (ఎస్సారార్) 19 పరుగులు చేసి అలరించారు. సీనియర్స్‌లో ఆదిల్ (వివేకానంద) 34 పరుగులు చేశారు. కాగా జూనియర్స్ విభాగంలో జ్యోతిష్మతి (కరీంనగర్), ఎస్సారార్ (మంచిర్యాల) జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి.



వికెట్ తీసిన ఆనందంలో..



# బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు కాస్త ఊరట లభించినా ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుందని ఆశగా ఎదురు చూసిన సింగరేణి కార్మికులకు నిరాశే మిగిలింది. కేంద్ర బడ్జెట్‌పై జిల్లాలోని వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, కార్మిక, ప్రజా సంఘాల నాయకుల అభిప్రాయాలు వాటి మాటల్లోనే...

### పేదలకు అనుకూలం



ఆసిఫాబాద్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు అనుకూలంగా ఉంది. రైతులు, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తుంది. ఏడాదికి రూ.7 లక్షల ఆదాయం ఉన్న వారికి ఇన్‌కంట్యాక్స్ కట్టాల్సిన అవసరం లేకుండా బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఎలక్ట్రానిక్, మొబైల్ ఫోన్ల ధరలు తగ్గనున్నాయి. ఆన్‌లైన్‌లో ఉద్యోగం చేసే వారికి పూర్తిగా బరువు తగ్గించారు. రైల్వే బడ్జెట్ రూ. 40 వేల కోట్లకు పెంచారు. రవాణా సౌకర్యానికి రూ. 3లక్షల కోట్లు కేటాయించారు.

– ఖాండ్రే విశాల్, బీజేపీ కుమురంభీం జిల్లా ఉపాధ్యక్షుడు

### ఎరువుల రాయితీ తగ్గింపు



ఆసిఫాబాద్:ఎరువుల రాయితీ తగ్గించారు. ఉపాధి హామీకి కోత విధించారు. ఇన్సూరెన్స్‌కు ట్యాక్స్ లేకుండా చేసి దొంగదెబ్బ తీశారు. మహిళలకు ప్రోత్సాహకరంగా ఉంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు రూ.7 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయించడం హర్షనీయం.

– కొక్కిరాల విశ్వప్రసాదరావు, డీసీసీ అధ్యక్షుడు, కుమురంభీం జిల్లా

### తెలంగాణపై వివక్ష



ఆసిఫాబాద్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపు లేకపోవడం బాధాకరం. తెలంగాణ నుంచి నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నా విభజన హామీల ప్రస్తావన లేకపోవడం శోచనీయం. రైతుల సంక్షేమం, వ్యవసాయంపై శీతకన్ను వేశారు. మొత్తానికి బడ్జెట్ ఖాళీ డబ్బాలో గుళకరాళ్లు వేసినట్లు ఉంది.

– కాంమ్రై అనిల్‌కుమార్, ఓయూ జేఏసీ కన్వీనర్

### కార్మికులకు నిరాశే



శ్రీరాంపూర్: కేంద్ర బడ్జెట్ బొగ్గు గని కార్మికులకు నిరాశే మిగిల్చింది. కోల్ సెక్టార్‌లో పనిచేసే కార్మికులకు రిస్క్ సెక్టార్‌గా గుర్తించి ఐటీమాఫీ చేయాలని చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నాం. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం వచ్చే ప్రధాన పార్టీ నేతలు హామి ఇచ్చి విస్మరిస్తున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా మాఫీ వస్తుందనుకుంటే రాలేదు.

– ఎస్కే బాజీసైదా, ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి

### నిరాశే మిగిల్చింది



శ్రీరాంపూర్: ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌పై వచ్చే వడ్డీ రూ.2.5 లక్షలు దాటితే దానిపై ఐటీ వసూలు చేయడం వల్ల ప్రతి ఉద్యోగిపై దీని ప్రభావం పడుతుంది. గతేడాది నుంచి ఇది అమలు చేస్తున్నారు. దీని ప్రభావం దేశ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులపై పడుతోంది. ఈ సారైనా పీఎఫ్ వడ్డీపై ఐటీని మినహాయిస్తారని అనుకున్నా నిరాశే మిగిలింది.

– కూసి తిరుపతి, ఉపాధ్యాయుడు

### కార్మిక వ్యతిరేకం



బెల్లంపల్లి: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో పేద, సామాన్యులకు మేలు కలిగేలా లేదు. దేశసంపదను అంబానీ, ఆదానీలకు, సంపన్న వర్గాలకు దోచిపెట్టడానికి బడ్జెట్ ప్రతిపాదించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలకు ఊతం ఇవ్వడానికి ఏమాత్రం నిధుల కేటాయింపులు లేవు. కేంద్ర బడ్జెట్ పూర్తిగా కార్మిక వ్యతిరేకమైంది. – చిప్ప నర్సయ్య, ఏఐటీయూసీ నాయకుడు , బెల్లంపల్లి

### అన్నివర్గాలకు అనుకూలం



బెల్లంపల్లి: కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అన్నివర్గాల ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చే విధంగా ఉంది. వ్యవసాయ రంగానికి రూ.20లక్షల కోట్లు కేటాయించడం వల్ల గ్రామీణ భారతం మరింత వృద్ధి చెందే అవకాశాలున్నాయి. దేశాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు బడ్జెట్‌లో సమతూకం పాటించారు. – సీహెచ్.కృష్ణదేవరాయలు, పీజీ విద్యార్థి, బోయపల్లి

### ధరల నియంత్రణ ప్రస్తావనే లేదు



బెల్లంపల్లి: నిత్యావసరాల ధరలు రోజురోజుకూ చుక్కలనంటుతున్నాయి. గృహ నిర్మాణాల ముడిసరుకు ధరలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. పెరుగుతున్న ధరలతో పేదలు పోటీ పడే పరిస్థితులు కనిపించడం లేదు. ధరల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను బడ్జెట్‌లో వివరించలేదు. ఇతర అంశాల్లో పర్వాలేదు. – రేఖ, గృహిణి, మాదారం

## క్లుప్తంగా

### ముమ్మరంగా సాగుతున్న జాతర ఏర్పాట్లు



పనులు పరిశీలిస్తున్న సింగరేణి అధికారులు

రెబ్బెన: గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 4 నుంచి 6 వరకు నిర్వహించనున్న జాతర ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఆలయ కమిటీతో పాటు సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేష్‌లు దగ్గరుండి జాతర ఏర్పాట్ల పనులు పర్యవేక్షిస్తున్నారు. బుధవారం రెబ్బెన ఎస్సై భూమేష్, తిర్యాణి ఎస్సై రమేష్‌లు జాతరలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రోడ్డు విస్తరణ పనులు చేయించారు. సింగరేణి అధికారులు ఆలయాన్ని సందర్శించి సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమాల్లో కమిటీ చైర్మన్ వెంకటేశం, ఎంపీటీసీ పెసరు మధునయ్య, బీఆర్ఎస్ నాయకులు పందిర్ల మధునయ్య పాల్గొన్నారు.

### 6 నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు



మాట్లాడుతున్న ఎంపీపీ మల్లిఖార్జున్

ఆసిఫాబాద్అర్బన్: ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎంపీపీ అరిగెల మల్లిఖార్జున్ తెలిపారు. బుధవారం పోటీల నిర్వహణపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ పాఠశాలల పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం వస్తుందన్నారు. మండలంలోని క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో శశికళ, ఎంఈవో మనుకుమార్, వివిధ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలతో పాటు పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

### కలెక్టర్ బదిలీతో సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో బుధవారం సాయంత్రం బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ బదిలీపై అదిలాబాద్‌కు వెళ్లిన నేపథ్యంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, సిర్పూర్ నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్‌చౌక్ లో టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

### రేపు పాదుక దర్శనం

కౌటాల: సిర్పూర్(టి) మండల కేంద్రంలో ఈనెల 3న పాదుక దర్శనం, ఉపాసక్ దీక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగద్గురు శ్రీ నరేంద్రచార్యజీ మహారాజ్ నాణీజ్ ధామ్ భక్తులకు ప్రవచనాలు బోధిస్తారన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

### ఎమ్మెల్యే భరోసా

వేమనపల్లి: నీల్వాయి ప్రాజెక్టు మట్టి కట్ట కింద ఇబ్బందులు పడుతున్న మామడ గ్రామస్తులకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య భరోసా ఇచ్చారు. 31వ తేదీన 'సాక్షి'లో నీల్వాయి నిండా ముంచుతోంది అనే కథనానికి ఎమ్మెల్యే చిన్నయ్య స్పందించారు. గ్రామస్తులను బెల్లంపల్లిలోని క్యాంపు ఆఫీస్‌కు పిలిపించుకుని వారి ఇబ్బందులపై చర్చించారు. పంచాయతీరాజ్ , ఇరిగేషన్ ఈఈలతో మాట్లాడారు. వారం రోజుల్లో వారి గ్రామస్తులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేలా అధికారులతో మాట్లాడుతానన్నారు. అదే విధంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్ల టెండర్ ప్రక్రియలో ఉండగా వారికి డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇప్పించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### ఉపాధిహామీ పనులపై సమీక్ష

జైపూర్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పనులపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ గ్రామ పంచాయతీలో 30మందికి తక్కువ కాకుండా ఉపాధి హామీ పనులు కల్పించాలని, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కలకు ప్రతి రోజు నీరు అందించాలని తెలిపారు. ఆదేవిధంగా చనిపోయిన పెన్షన్‌దారుల వివరాలను ప్రతి నెలా ఒకటో తేదీలోగా ఎంపీడీవో కార్యాలయంలో అందించాలన్నారు. గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో బాలయ్య, ఈసీ రాజమొగిలి పాల్గొన్నారు.

## మూలమలుపు.. ప్రమాదాలకు పిలుపు



ఈజ్‌గాం వద్ద గల మూలమలుపు



సీతానగర్ సమీపంలోని మూలమలుపు



సారసాల గ్రామం వద్ద మూలమలుపు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం, సీతానగర్, సారసాల గ్రామాల సమీపంలో రోడ్డుపై ఉన్న మూలమలుపులు ప్రమాదాలకు పిలుపుగా మారుతున్నాయి. ఈ మార్గం గుండా కాగజ్‌నగర్ నుంచి కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడూ చూసినా రద్దీగా ఉండే రహదారిలోని మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా అనేకం ఉన్నాయి. అయినా సంబంధిత అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## అటెన్షన్ ప్లీజ్.. నిరుపయోగంగా మరుగుదొడ్లు




కెరమెరి: మండలంలోని రాంజీగూడ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో గతంలో రూ.2 లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. సదరు గుత్తేదారు నీటి సరఫరా కోసం వాటర్‌ట్యాంకు ఏర్పాటు చేయకపోవడంతో వినియోగంలోకి రావడం లేదు. వెంటనే అధికారులు స్పందించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: కుష్మెత సుధాకర్, ఎంఈవో, కెరమెరి
ఫోన్ నంబర్: 6303401748

# సర్కారు బడికి కార్పొరేట్ హంగులు

- 'మన ఊరు మన బడి'లో భాగంగా పాఠశాలల ఎంపిక
- 18 స్కూళ్లలో పనులు పూర్తి



ఆహ్లాదకరమైన తరగతి గది



వాంకిడిలోని ఒడ్డెరవాడ పాఠశాల

ఆసిఫాబాద్‌రూరల్: సర్కారు బడిలో కార్పొరేట్ తరహా విద్య అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మన ఊరు –మన బడి కార్యక్రమంలో భాగంగా మొదటి విడుతలో జిల్లాలోని 251 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటికి అన్ని హంగులతో వసతులు కల్పించి ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులకు విద్య అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

**18 స్కూళ్లలో పనులు పూర్తి..**

జిల్లాలో మొదటి విడుతలో భాగంగా 251 పాఠశాలలను ఎంపిక చేసి వాటికి రూ.69.69 కోట్లు నిధులు మంజూరు చేశారు. కాగా వీటిలో ప్రతీ మండలానికి రెండు పాఠశాలల చొప్పున మొత్తం 30 పాఠశాలల్లో పనులు ప్రారంభించగా 18 పాఠశాలల్లో 100 శాతం పనులు పూర్తయ్యాయి. మిగితా 12 పాఠశాలల్లో ఎన్ఆర్‌జీఎస్ ద్వారా చేపడుతున్న ప్రహరీ గోడ పనులు కొనసాగుతున్నాయి.

**నేడు నాలుగు ప్రారంభం..**

నేడు వాంకిడి మండలంలోని ఒడ్డెవాడ, కాగజ్‌నగర్‌లోని రిక్షాకాలనీ, సిర్పూర్‌టి లోని హుడ్కి, నవేగాం పాఠశాలలు ప్రారంభించనున్నారు. ఒడ్డెవాడ పాఠశాలకు రూ.9.45 లక్షలు, హుడ్కి పాఠశాలకు రూ. 22.72 లక్షలు, నవేగాంలోని పాఠశాలకు రూ. 29.36 లక్షలు, కాగజ్‌నగర్‌లోని రిక్షాకాలనీలో గల పాఠశాలకు రూ. 19.46 లక్షలు మంజూరు కాగా, వీటిలో విద్యుత్, తాగు నీటి సౌకర్యం, భోజనశాల, అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, ప్రహరీ గోడ, పెయింటింగ్, తరగతి గదుల్లో డ్యుయల్ డెస్కులు, గ్రీన్‌చాక్ బోర్డులు, కుర్చీలు, టేబుళ్లు, కంప్యూటర్ ల్యాబ్, ఫర్నీచర్ తదితర వసతులను మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా సమకూర్చారు.

**వాంకిడిలో..**

వాంకిడి: పాఠశాలల్లో మన ఊరు –మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను నేడు ప్రారంభిస్తున్నట్లు ఎంఈవో మనుకుమార్ తెలిపారు. మండలంలోని వడ్డెరవాడ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

# హనుమాన్ ఆలయం ముస్తాబు



ముస్తాబైన హనుమాన్ ఆలయం

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలోని వార్ధా నది ఒడ్డున గల శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న భవ్య విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తామని బుధవారం కమిటీ సభ్యులు తెలిపారు. నేడు ఉదయం 9 గంటలకు వాల్మీకి మహర్షి ఆలయం నుంచి రథయాత్రను సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభిస్తారని తెలిపారు.

**మూడు రోజులపాటు పూజలు**

నేడు ఆలయంలో దేవతల ఊరేగింపు, మంత్ర హోమాలు, యాగశాల ప్రవేశం, 3వ తేదీన కుంకుమార్చన, కాలపూజ, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు పటేల్ తెలిపారు. 4న దేవతల విగ్రహా ప్రతిష్ఠాపన, మహాపూర్ణాహుతి అభిషేకం, మహాపూజ, గోపాలకాల, కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆలయంలో నిర్వహించే మూడు రోజుల మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

# 'నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్'



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

రెబ్బెన: ఆపద సమయంలో నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారి ఆదుకుంటుందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండలంలోని వంకులం గ్రామానికి చెందిన సోమయ్యకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.32వేల చెక్కును బుధవారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ నానయ్య

చింతలమానెపల్లి: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. బుధవారం మండలంలోని లంబాడిహేటి గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. వైద్యాధికారి అజీముద్దీన్ మాట్లాడుతూ మండలంలో రవీంద్రనగర్, కోర్సిని గ్రామపంచాయతీలలో కంటి వెలుగు పూర్తి చేశామన్నారు. ఎంపీటీసీ ధన్‌రాజ్, శిబిరం వైద్యాధికారి అజ్మీర రాజ్‌కుమార్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డుబ్బుల వెంకన్న, కార్యదర్శి రాచకొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన సమ్మక్క జాతర



చింతలమానెపల్లి: మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నందిగూడ గ్రామశివారులో గల సమ్మక్క –సారలమ్మ గద్దెల వద్ద బుధవారం మినీ మేడారం జాతర ప్రారంభమైంది. డప్పువాయిద్యాల మధ్య అంగరంగ వైభవంగా ప్రారంభం కాగా భక్తులు సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఈనెల 4వ తేదీ వరకు కొనసాగనుంది. రూరల్ ఎస్సై సోనియా ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్, కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**ఖర్జెల్లిలో సమ్మక్క –సారక్క బోనాలు**

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లిలో బుధవారం సమ్మక్క సారక్క బోనాలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, భక్తులు పెద్దఎత్తున సమ్మక్క, సారక్క గద్దెల వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించారు. బోనాలు సమర్పించిన అనంతరం భక్తులు నైవేద్యాలు అర్పించారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఫణికుమార్

రెబ్బెన: గంగాపూర్ జాతరలో దుకాణదారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే చర్యలు తప్పవని స్వచ్ఛ భారత్ జిల్లా కోఆర్డినేటర్ ఫణికుమార్, గంగాపూర్ పంచాయతీ కార్యదర్శి మురళీధర్‌లు హెచ్చరించారు. డీఆర్‌డీవో ఆదేశాల మేరకు బుధవారం గంగాపూర్ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణదారులకు అవగాహన కల్పించి నోటీసులు అందజేశారు. వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించిందన్నారు. ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లకు బదులు ప్రత్యామ్నాయ కవర్లను ఉపయోగించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

## స్టోర్‌రూం కాదు..!



తిర్యాణి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గల వాష్‌రూం స్టోర్‌రూంను తలపిస్తుంది. కార్యాలయానికి వచ్చే ప్రజలు వినియోగించాల్సిన వాష్‌రూంను సిబ్బంది నిర్లక్ష్యంతో స్టోర్‌రూంగా మార్చారు. దీంతో మండలంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# కరెంట్ కోతలు.. వినియోగదారుల వెతలు

- వారం రోజులుగా గంటల తరబడి విద్యుత్ కట్
- మరమ్మతుల పేరిట అంతరాయం
- ఇబ్బంది పడుతున్న చిన్నారులు, వృద్ధులు



కౌటాల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

కౌటాల: కొన్ని రోజులుగా అధికారిక, అనధికారిక విద్యుత్ కోతలతో మండలంలోని చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా గంటల తరబడి కోతలు విధిస్తుండటంతో పనులు కావడం లేదని వాపోతున్నారు. కొద్దిపాటి గాలివీచినా, చినుకుపడినా అంధకారం తప్పడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని చెబుతున్న మాటలు కౌటాలలో అమలుకు నోచుకోవడం లేదు.

**గంటల తరబడి కోతలు..**

మండలంలో అప్రకటిత కోతలు పెరిగిపోయాయి. ముందస్తు సమాచారం లేకుండా అధికారులు కోతలు విధిస్తుండటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత వారం రోజుల నుంచి కోతలు మరింత ఎక్కువయ్యాయి. గతంలో గంటల తరబడి విద్యుత్ కోతలు విధించాల్సి వస్తే అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చేవారు. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. మరమ్మతుల పేరిట మధ్యాహ్నం 1గంట నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**కాలం ఏదైనా అదే పరిస్థితి..**

ఏ కాలంలోనైనా మండల ప్రజలకు విద్యుత్ కోతలు తప్పడం లేదు. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడితే ముందస్తుగా జాగ్రత్తగా కరెంట్ కట్ చేస్తుంటారు. కాని వాతావరణం సాధారణంగా ఉన్నా విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తున్నారు. ఫోన్ ద్వారా విద్యుత్ అధికారులను సంప్రదిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని విద్యుత్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కరెంట్ కోతలు లేకుండా, మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలని మండలవాసులు కోరుతున్నారు.

### పశువులకు టీకాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: పాడిరైతులకు పశువులు, గేదెలకు టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వై.రమేష్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రెండ వార్డు దొరగారిపల్లిలో పశువులు, గేదెలకు టీకాలు వేశారు.